


# కరపత్రం

SINCE 2014

గురువారం ఆగస్ట్ 06, 2026 | సంపుటి : 2 | సంచిక : 295 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



### తుమ్మిడిహట్టి పెంపునకు

# ఒత్తడి తెండి

## మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

### కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి

- అటవీ పర్యావరణ అనుమతులపై భూపేంద్రయాదవ్‌తో చర్చ
- ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి
- బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

**న్యూఢిల్లీ,ఆగస్ట్5:** తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. 150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్వీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.



## 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ

# అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు
- ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి
- అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి
- జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్,ఆగస్ట్5 :** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు.

2 లో

## డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్

- సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి
- సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి
- భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్,ఆగస్ట్5 :** డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

మిగతాది 2లో



2 లో

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

- నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ
- 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

**హైదరాబాద్,ఆగస్ట్5:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.



## సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

### షరతులతో అనుమతిచ్చిన ఎసిబి కోర్టు

2 లో



## విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశిపతి శ్రీనివాస్

**హైదరాబాద్,ఆగస్ట్5 :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు.



మిగతాది 2లో

## పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

- » తుదిదశకు మూసారాం బాగ్ బ్రిడ్జి పనులు
- » పనులను పర్యవేక్షించన మంత్రులు

## భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

# పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5 :** భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు వచ్చాయని ప్రస్తావించారు.

2లో..




2లో

### తెలంగాణలో డయల్

## 112 సేవలు ప్రారంభం

- » పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్
- » సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

**హైదరాబాద్,ఆగస్ట్5 :** తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటగులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

# క్షుద్ర పూజలపై

# హరీష్ వివరణ ఇవ్వాలి

- లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా
- నిజామబాద్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్ గౌడ్



**నిజామాబాద్,ఆగస్ట్5 :** తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. తమవద్ద హరీస్ పూజలపై ఆధారాలు ఉన్నాయని అన్నారు. నిజామాబాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. 'పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకోకుండా క్షుద్ర పూజలు చేయడం శ్రేయస్కరం కాదు. నాకు ఇచ్చిన లీగల్ నోటీసులపై సరైన సమయంలో సమాధానం చెబుతా నని, దీనికి భయపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యానే దీనిపై మాట్లాడుతున్నాం. నాకు ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలోని బోనాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు బోనాల పండగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ, మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ ప్రెసిడెంట్‌నగేశ్ రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు

# రద్దుచేసే కుట్ర

**గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు**

- 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,ఆగస్ట్5 :** ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.

02

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన

ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఖీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

# 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

మొదటిపేజీ తరువాయి

ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ÷-రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు.

22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశిరచిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఏ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు ? ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

## భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి ఈ బ్రిడ్జిని తీసుకువస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఈ రెండో బ్రిడ్జి ఎంతో సౌకర్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## కొరియర్ బాయ్‌గా వచ్చి మహిళ మెల్లో గొలుసు చోరీ

### సిసి ఫుటేజి ఆధారంగా దొంగను పట్టుకున్న పోలీసులు

మియాపూర్ పరిధిలో కొరియర్ బాయ్‌గా నటిస్తూ ఇంట్లోకి ప్రవేశించిన ఓ యువకుడు మహిళపై పెప్పర్ స్ప్రే చల్లి బంగారు మంగళసూత్రాన్ని అపహరించిన ఘటన కలకలం రేపింది. సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కొరియర్ డెలివరీ పేరుతో వచ్చిన నిందితుడు.. మహిళ ముఖంపై పెప్పర్ స్ప్రే చల్లి ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలి భర్త మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, బంగారు మంగళసూత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ ఖాజా అర్షద్ (20)గా గుర్తించారు. నిందితుడిపై గతంలో ఏపీలోని కనిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

## డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి

బిరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్?2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

÷లంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

÷ూష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు.

సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాకల్ఎట్లు విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో దుండిగల్ తండా-2లో తనిఖీలు చేశారు. నిందితుడి దగ్గరి నుంచి 350 గ్రాముల 71 గంజాయి చా÷-లకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాజీపల్లిలోని కంపెనీలో లేబర్‌గా పనిచేస్తూ దుండిగల్ తండా-2లో నిందితుడు రంజిత్ కుమార్ నివాసం ఉంటునట్లు పోలీసులు వెల్లడించారు. బిహార్‌లోని తన అత్తగారి ఊరి నుంచి గంజాయి చా÷-లకెట్లను కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తెలిపారు. తండాలోని స్థానిక కార్మికులకు, లేబర్లకు గంజాయి చా÷-లకెట్లను అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

2024-25 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో విద్యారంగానికి కేవలం 5.98 శాతం మాత్రమే కేటాయించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. గత 6-7

ఏళ్ల తెలంగాణ బడ్జెట్‌లను పరిశీలిస్తే విద్యారంగానికి ఇంత తక్కువ శాతం నిధులు కేటాయించడం ఇదే తొలిసారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజ్ఞాన గనిగా మారాల్చిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే ఉంచుకున్నప్పటికీ, ఆ శాఖకు తగిన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తారని భావిస్తే, బ్జడెట్‌లో కేవలం 5.98 శాతానికే పరిమితం చేయడం దురదృష్టకరమని అన్నారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యా లయాలు మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ సమాజం విద్యావంతం కావడం, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే విద్యారంగానికి కేటాయింపు లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షి స్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్డ్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

మొదటిపేజీ తరువాయి

దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫ్లై÷ర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు

ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్‌ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నూతనంగా రూపుదిద్దుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల

వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు, అలాగే మరోవైపు చంపాపేట వైపు సులభంగా వెళ్లేలా మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. అతిత్వరలోనే ఈ వంతెనను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించడమే కాకుండా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు సైతం చివరి ఘట్టానికి చేరుకున్నాయని, రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్ల విస్తరణను వేగవంతం చేశామని తెలిపారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన బ్రిడ్జి పనులతో పాటు పెండింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజా రవాణాను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఆగస్ట్ 06, 2026

## మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





**మహేశ్వరం: బడంగ్పేట ఆగస్టు 5: కరపత్రం ప్రతినిధి**

మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు.మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ ప్రజాభవన్‌లో డాక్టర్ స్వర్ణలత సహోదరి ఫౌండేషన్, మెప్మ (వీజూహీూ) ఆధ్వర్యంలో నిర్వహించిన యూనిఫామ్ టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళా అభ్యర్థులకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డాక్టర్ స్వర్ణలత సహోదరి ఫౌండేషన్ చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మహిళలను స్వయం ఉపాధి వైపు నడిపిస్తూ ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతున్నాయని అభినందించారు. శిక్షణ పొందిన మహిళలు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, డివిజన్లలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, డాక్టర్ స్వర్ణలత సహోదరి ఫౌండేషన్, మెప్మ ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా అభ్యర్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..[7:41 PM,, 8/5/2026ి ం91 88864 76498:

## కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ పాఠశాలల ఆకస్మిక తనిఖీలు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.కోరుట్లలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల,మోహన్‌రావుపేట జడ్పీహెచ్ఎస్, మధాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్య, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదుల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన విధానంపై ఆరా తీశారు.మధాపూర్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేసి, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారి మందిరంలో బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ, కోరుట్ల నియోజకవర్గ ప్రజలపై తల్లి చల్లని చూపు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఘనంగా గంగమ్మ తల్లి బోనాల జాతర వేడుకలు

గంగమ్మ తల్లి బోనాల జాతర వేడుకలను గంగపుత్ర బెస్తలు బుధవారం అంగరంగ వైభవంగా ఘనంగా జరుగుపుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో శ్రీ గంగామాత విగ్రహాన్ని ఉంచి కొబ్బరి కాయ కొట్టి గంగమ్మ తల్లి బోనాల వేడుకను ప్రారంభించారు. గంగాపుత్ర బెస్తలు తమ సంపద్రాయ వృత్తి అయిన చేపలు పట్టే పెద్ద వలన అందంగా ఆలంకరించి ప్రదర్శిస్తుండగా, మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ర్యాలీగా గోదావరి వరకు తరలి వెళ్లారు. ర్యాలీలో భాగంగా ప్రధాన రస్తాలో డీజే సౌండ్స్?తో పాటు సంప్రదాయల నృత్యాలు చేయడంతో పాటు చేపలు పట్టే విధానాలను ప్రదర్శించారు. అదే విధంగా డప్పు కళాకారులతో సైతం ప్రత్యేక నృత్యాలు చేశారు. గంగపుత్ర బెస్తలు నిర్వహించిన బోనాల వేడుకలను పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆనంతరం గోదావరి తీరం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెపై గంగమ్మ తల్లి, గౌరమ్మ, మత్స్యగిరింద్ర, చేప, తాబేలు ప్రతిమలను పెట్టి వివిధ రకాల పూలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా పూజించారు. ఆనంతరం గంగ, గౌరమ్మలతో పాటు మత్స్యగిరింద, చేప, తాబేలు ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేశారు.

# ఆషాఢం వేళ పోచమ్మ ఆలయం వద్ద భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు దేవాలయ పరిసరాల పరిశుభ్రత

7వ వార్డు కౌన్సిలర్ ఫెరోజ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఆగస్టు 5:**

ఆషాఢ మాసం సందర్భంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ఏడవ వార్డు దుర్గా కాలనీలో వెలసిన పోచమ్మ--మారెమ్మ దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. 7వ వార్డు కౌన్సిలర్ ఫెరోజ్ ఆధ్వర్యంలో దేవాలయ పరిసరాలను పూర్తిగా శుభ్రపరచడంతో పాటు భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు.ఆషాఢ మాసంలో ప్రతి ఏడాది పోచమ్మ--మారెమ్మ దేవాలయానికి వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ చెత్తాచెదారాన్ని తొలగించి, భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. వేసవి తాపం, అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీటి





కొరత ఏర్పడకుండా వాటర్ ట్యాంకర్‌ను అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫెరోజ్ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడం తమ బాధ్యత అని, ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడు ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అవసరమైతే మరిన్ని సౌకర్యాలు కూడా కల్పిస్తామని చెప్పారు.స్థానికులు కౌన్సిలర్ చేపట్టిన ఏర్పాట్లను అభినందిస్తూ, భక్తుల అవసరాలను గుర్తించి ముందస్తుగా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. భక్తులు కూడా పరిశుభ్రతను కాపాడుతూ ఆలయ పవిత్రతను పరిరక్షించాలని కోరారు.

## రాజేష్ ఠాకూర్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

అన్నదానం, విద్యార్థులకు పుస్తకాలు--పెన్నుల పంపిణీ

జమ్మికుంటలో ఘనంగా నిర్వహించిన బీజేపీ నాయకులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఆగస్టు 5:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో విశ్వేశ్వర ఆలయం బొమ్మల గుడి శివాలయంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజేష్ ఠాకూర్ జన్మదినాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలో బీజేపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆర్భాటాలకు దూరంగా సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమాలు స్థానికుల ప్రశంసలు అందుకున్నాయి.ఈ సందర్భంగా జమ్మికుంటలోని బొమ్మలగుడిలో అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం అత్యున్నత సేవ అని, సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నాయకులు





పిలుపునిచ్చారు.అనంతరం జమ్మికుంటలోని ఆబాది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాజేష్ ఠాకూర్ ప్రజాసేవకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ పార్టీ బలోపేతంతో పాటు పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జమ్మికుంట టౌన్ అధ్యక్షుడు కొలకాని రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, సామాజి కొమురయ్య, రాకేష్ ఠాకూర్, అడువల శ్రీధర్, రాయబారపు సురేష్, రామంచ రాజేష్, గణేష్, అదులపురం శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం రాజేష్ ఠాకూర్ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. సేవా దృక్పథంతో నిర్వహించిన అన్నదానం, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలు ప్రజల నుంచి మంచి స్పందన పొందాయి.

## ఫ్లైఓవర్పై మర్రిచెట్టు ముప్పు... నిద్రపోతున్న అధికారులు!

జమ్మికుంటలో ప్రమాద ఘంటికలు మోగుతున్నా స్పందన శూన్యం

ఆర్అండ్ బి బాధ్యత? మున్సిపాలిటీదా? ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 5**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఓ సమస్యపై సంబంధిత శాఖలు ఇప్పటికీ కళ్లు తెరవకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ప్రమాద సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత అంబేద్కర్ కరెంట్ ఆఫీస్ ఆవరణ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్క భాగంలో మొలిచిన మర్రిచెట్టు రోజురోజుకూ భారీగా పెరుగుతోంది. చెట్టు ఊదలు బ్రిడ్జి కిందికి వేలాడుతూ కనిపిస్తుండగా, వేర్లు కాంక్రీట్ నిర్మాణంలోకి చొచ్చుకుపోతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాలపై పెరిగే ఇలాంటి చెట్లు కాలక్రమేణా కాంక్రీట్ను బలహీనపరచి నిర్మాణ స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ ఫ్లైఓవర్ను ఉపయోగిస్తున్నారు. భారీ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర రవాణా వాహనాలు నిరంతరం ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో బ్రిడ్జిపై పెరిగిన మర్రిచెట్టును వెంటనే తొలగించాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ సమస్యపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫ్లైఓవర్ నిర్వహణ బాధ్యత లిరోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్అండ్) లిదా? లేక పట్టణ పరిధిలో ఉన్నందున మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బాధ్యత ఎవరిదైనా ప్రజల భద్రతే ముఖ్యమని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. చిన్న మొక్కగా ఉన్నప్పుడే తొలగించాల్సిన చెట్టు ప్రస్తుతం భారీగా పెరిగి ఊడలు కిందికి వేలాడే స్థాయికి చేరుకోవడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తోందని ప్రజలు అంటున్నారు. సంబంధిత అధికారులు తరచూ ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణిస్తున్నప్పటికీ ఈ ప్రమాదాన్ని గుర్తించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని విమర్శిస్తున్నారు. గతంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చెట్ల వేర్లు నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ నిర్మాణాలు దెబ్బతిన్న సంఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు





చేస్తున్న స్థానికులు, జమ్మికుంటలో అలాంటి పరిస్థితి రాకముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ పాలకవర్గం, ఆర్అండ్ అధికారులు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి చెట్టును సురక్షితంగా తొలగించి బ్రిడ్జికి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. "ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు... ప్రమాదాన్ని ముందే నివారించడం అధికారుల బాధ్యత" అని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు పరస్పర బాధ్యతలపై చర్చించకుండా వెంటనే స్పందించి ఫ్లైఓవర్పై పెరిగిన మర్రిచెట్టును తొలగించి, బ్రిడ్జి భద్రతపై సాంకేతిక పరీక్షలు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## వెల్దుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కరెక్టు యోగ కార్యక్రమాలను ప్రారంభించిన ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య

ఈ విద్య సంవత్సరానికి విద్యార్థుల సమగ్రమ వికాసాన్ని లక్ష్యంగా చేసుకొని కరాటే యోగ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది

ప్రతిరోజు యోగా కరాటే శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం

యోగ శిక్షకురాలు ఇందిరా విద్యార్థులకు యోగ వాసనాలు దాన్ని మట్టి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది

కరాటే మాస్టర్ ఈ. వైష్ణవి ఆత్మ రక్షణ విద్య క్రమశిక్షణ శారీరకత్వం దృఢతత్వం ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా అందిస్తారు

పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఆగస్టు 5**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి యందు కరాటే, యోగ కార్యక్రమాలు ప్రారంభించిన ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల సమగ్ర వికాసాన్ని లక్ష్యంగా చేసుకుని బుధవారం నాడుకరాటే, యోగ కార్యక్రమాలు ప్రారంభించుకోవడం జరిగిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్యతెలియజేసారు.ప్రతిరోజూ యోగా కరాటే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి.ఈ కార్యక్రమంలో యోగా శిక్షకురాలు ఇందిరా విద్యార్థులకు యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాలపై శిక్షణ అందిస్తుండగా, కరాటే మాస్టర్ ఈ.వైష్ణవి ఆత్మరక్షణ విద్య, క్రమశిక్షణ, శారీరకదృఢత్వం,ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా కరాటే శిక్షణను అందిస్తున్నారు.ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆత్మరక్షణ నైపుణ్యాలను అలవరచుకోవడానికి యోగా, కరాటే శిక్షణ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ శిక్షణలో క్రమం తప్పకుండా పాల్గొని ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు.ఈకార్యక్రమం లో ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, నర్సింహా రెడ్డి, అర్చన,వెంకటస్వామి, నవనీత, అమూల్య, జయసుధ, శైలజ తదితర ఉపాధ్యాయులుపాల్గొన్నరు..







కరపత్రం తెలుగు దిన పత్రిక
గురువారం ఆగస్ట్ 06, 2026

# ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి: దళితరత్న పనికిల శ్రీనివాస్

- సామాజిక న్యాయం, స్వాభిమాన తెలంగాణ కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు జయశంకర్ సార్
- దళితరత్న, జాతీయ మాల మహానాడు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పనికిల శ్రీనివాస్




**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 5**
తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి, సామాజిక న్యాయం, స్వాభిమానం, సమాన అభివృద్ధితో కూడిన తెలంగాణ నిర్మాణానికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని జాతీయ మాల మహానాడు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పనికిల శ్రీనివాస్ అన్నారు. గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాంతం తన మేధస్సు, ఆలోచనలు, ఉద్యమ స్ఫూర్తిని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి-ఆగస్టు 6 పురస్కరించుకొని జాతీయ మాల మహానాడు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, దళితరత్న పనికిల శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పిస్తూ.. ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దళితరత్న పనికిల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ఉన్న సిద్ధాంత బలానికి ప్రతిరూపం జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వయంపాలన, ప్రాంతీయ హక్కుల కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఎన్నో దశాబ్దాల పాటు రాజీపడకుండా పోరాడిన మహనీయుడిగా జయశంకర్ సార్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఆయన రచనలు, ఆలోచనలు, ఉద్యమ దిశానిర్దేశం తెలంగాణ సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా జయశంకర్ సార్ కలలుగన్న సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధి, విద్యా ప్రగతి, యువత సాధికారత వంటి లక్ష్యాల సాధన దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యువత జయశంకర్ సార్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలని, తెలంగాణ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ కోసం తన జీవితాన్నే అంకితం చేసిన ఆ మహనీయుడి సేవలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువరని, ఆయన ఆశయ సాధనే ఆయనకు అందించే గొప్ప నివాళి అని దళితరత్న పనికిల శ్రీనివాస్ పేర్కొన్నారు.

# కొంపల్లి, ఉప్పల్ వంతెనల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఈటల రాజేందర్ విజ్ఞప్తి



**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 5**
కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణ బీజేపీ ఎంపీల బృందం బుధవారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ రాష్ట్రంలోని పలు జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొంపల్లి, ఉప్పల్ ఎగువ వంతెనల నిర్మాణ పనులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పక్కనున్న సేవా రహదారులను గుంతలు లేకుండా మరమ్మతులు చేసి, సురక్షితంగా తీర్చిదిద్దాలని కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సేవా రహదారుల మరమ్మతు పనులను పదిరోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, మాధవనేని రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేష్ పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు బత్తుల సత్యం మాతృవియోగం.. ప్రముఖుల ప్రగాఢ సంతాపం

- ప్రమీల చిత్రపటానికి పుష్పాంజలి.. కుటుంబ సభ్యులను పరామర్శించిన నేతలు



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 5**
వరంగల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు బత్తుల సత్యం, ఆయన సోదరుడు శ్రీధర్‌ల మాతృమూర్తి బత్తుల ప్రమీల ఆకస్మిక మృతి పట్ల పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుధవారం శివనగర్‌లోని వారి నివాసానికి వెళ్లిన భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు తాటిపాముల వెంకట్రాములు, జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్, రాష్ట్ర పోపా అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు నరేందర్ తదితరులు బత్తుల సత్యం, శ్రీధర్, వెంకటయ్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వెంకట్రాములు మాట్లాడుతూ.. బత్తుల ప్రమీల మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం కీర్తిశేషురాలు బత్తుల ప్రమీల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ - 2026 బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

- దక్షిణ భారతానికి హైదరాబాద్‌లో శాశ్వత సుప్రీంకోర్టు ధర్మాసనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- న్యాయం ప్రజలకు మరింత చేరువ కావాలంటే ప్రాంతీయ ధర్మాసనం అవసరం: ఎంపీ రవిచంద్ర



**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 5**
సుప్రీంకోర్టులో పెరుగుతున్న పెండింగ్ కేసుల భారం దృష్ట్యా న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచే సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ--2026 బిల్లును బీఆర్ఎస్ సంపూర్ణంగా స్వాగతిస్తూ మద్దతు తెలుపుతున్నట్లు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. బుధవారం రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, ప్రస్తుతం సుప్రీంకోర్టులో 92 వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో న్యాయమూర్తుల సంఖ్య పెంపు అత్యంత అవసరమని పేర్కొన్నారు. దీనివల్ల మరిన్ని ధర్మాసనాలను ఏర్పాటు చేయడంతో పాటు రాజ్యాంగ ధర్మాసనాల నిర్వహణ కూడా మరింత సమర్థంగా జరిగే అవకాశం ఉంటుందని అన్నారు.
అయితే, న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం మాత్రమే కాకుండా దక్షిణ భారతదేశంలో శాశ్వత సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాల ప్రజలు ప్రతి ముఖ్యమైన న్యాయ వ్యవహారం కోసం ఢిల్లీకి వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల సాధారణ రైతు, ఉద్యోగి, వ్యాపారి, విద్యార్థి, నిరుద్యోగి, మధ్యతరగతి కుటుంబాలపై ప్రయాణ, వసతి, న్యాయవాదుల సేవలకు సంబంధించిన భారీ ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయం సమానంగా అందాలంటే న్యాయాన్ని పొందే అవకాశం కూడా సమానంగా ఉండాలని వ్యాఖ్యానించిన రవిచంద్ర, దక్షిణ భారతదేశానికి శాశ్వత సుప్రీంకోర్టు ధర్మాసనం ఏర్పాటు చేయడానికి హైదరాబాద్‌కు మించిన అనువైన నగరం మరొకటి లేదన్నారు. భౌగోళికంగా హైదరాబాద్ దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రంగా ఉండటంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రాంతాల ప్రజలు సులభంగా చేరుకోగలరని తెలిపారు. అంతేకాకుండా రక్షణ, కేంద్ర ప్రభుత్వ కీలక కార్యాలయాలు, ఇస్రో వంటి శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా సంస్థలు, సమాచార సాంకేతికం, ఔషధ తయారీ, జీవ విజ్ఞాన శాస్త్రాలు, అంతరిక్ష పరిశోధన రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయని వివరించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.
హిందీ మాట్లాడే ప్రజల సంఖ్య కూడా హైదరాబాద్‌లో అధికంగా ఉండటంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వ్యాజ్యదారులు, న్యాయవాదులు, అధికారులకు ఈ నగరం మరింత అనువుగా ఉంటుందని తెలిపారు.
సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఈ బిల్లుతో పాటు హైదరాబాద్‌లో దక్షిణ భారతదేశానికి శాశ్వత సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని బలంగా కోరుతున్నట్లు రవిచంద్ర స్పష్టం చేశారు. ఇది కేవలం తెలంగాణకు సంబంధించిన డిమాండ్ కాదని, దక్షిణ భారత ప్రజల దశాబ్దాల నాటి న్యాయమైన ఆకాంక్ష అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శాశ్వత సుప్రీంకోర్టు ధర్మాసనం ఏర్పాటైతే ప్రజలకు త్వరితగతిన, తక్కువ వ్యయంతో, సులభంగా న్యాయం అందుతుందని, న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే చారిత్రాత్మక సంస్కరణగా అది నిలుస్తుందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు.

# 32వ డివిజన్‌లో ఘనంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ జన్మదిన వేడుకలు



**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 5**
వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే,తెలంగాణ ఉద్యమకారుడు నన్నపునేని నరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని 32వ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు.మాజీ డివిజన్ అధ్యక్షుడు పొగాకు సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొక్కలు నాటడంతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పొగాకు సందీప్ మాట్లాడుతూ,నన్నపునేని నరేందర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.రానున్న ఎన్నికల్లో ఆయన భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రివర్గంలో స్థానం పొందాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కుడా డైరెక్టర్ మోడెం ప్రవీణ్,పరదేశి రాజేష్,ఆడెపు బిక్షపతి,పసునూరి సువర్ణ,దస్తగిర్,సీతారాయుడు, సాయి శ్రీను,గోగికార్ రవీందర్,నూక రమేష్,సిద్ధార్థ,సంతోష్,వేణు తదితర నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధే అజెండా.. ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ కీలక భేటీలు - సీఎంతో కలిసి కేంద్ర మంత్రులను కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- పర్యావరణ అనుమతులు, సాగునీటి ప్రాజెక్టులు, తుమ్మిడిహెట్టి అంశాలపై వినతిపత్రాల సమర్పణ
- తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరిన రాష్ట్ర ప్రభుత్వం





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 5**
తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రతినిధి బృందం బుధవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రుల దృష్టిని ఆకర్షించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలుత కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమై సాగునీటి ప్రాజెక్టులు, నీటి వనరుల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశాలకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఇతర ఎంపీలు, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులు, అటవీ సంరక్షణ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులకు వేగవంతమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారు. అలాగే రాష్ట్రంలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ప్రత్యేకంగా గోదావరి జలాల వినియోగానికి కీలకమైన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి సానుకూల నిర్ణయం తీసుకునేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఉన్న అంశాలపై కేంద్ర మంత్రులతో జరిగిన ఈ సమావేశాలు తెలంగాణకు ప్రయోజనం చేకూర్చే దిశగా కీలకంగా మారనున్నాయని రాష్ట్ర ప్రతినిధి బృందం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటేనే ఉత్తమ ఆయుధం: కరాటే మాస్టర్ ఎస్ క్కే జలీల్

- జమ్మికుంట రోడ్డులోని న్యూ కాకతీయ మోడల్ స్కూల్లో ప్రతిరోజూ సాయంత్రం కరాటే శిక్షణ

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, ఆగస్టు 5**




ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, అత్యాచారాల వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆడపిల్లకు ఆత్మరక్షణ విద్య తప్పనిసరిగా నేర్పించాలని గ్లోబల్ షోటోకాన్ కరాటే-డో ఇండియా కరీంనగర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్ కే జలీల్ పిలుపునిచ్చారు. హుజురాబాద్ లోని జమ్మికుంట రోడ్డులో ఉన్న న్యూ కాకతీయ మోడల్ స్కూల్ ప్రాంగణంలో ప్రతిరోజూ సాయంత్రం కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బాలికలు, మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగడానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. “ఎవరో వచ్చి మన పిల్లలను ఎదురుచూడకుండా. వారి రక్షణకు కాపాడతారని అవసరమైన ఆత్మవిశ్వాసం, ధైర్యం, స్వీయరక్షణ నైపుణ్యాలను మనమే అందించాలి. కరాటే నేర్చుకున్న ప్రతి అమ్మాయి అత్యవసర పరిస్థితుల్లో తనను తాను రక్షించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటుంది. ఇంటి నుంచి బయలుదేరిన కుమార్తె సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవాలంటే కరాటే వంటి ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరం” అని ఎస్ కే జలీల్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెల భద్రతను దృష్టిలో ఉంచుకుని కరాటే శిక్షణలో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కరాటే కేవలం ఒక క్రీడ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే జీవన విద్య అని ఆయన అన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి 'స్ఫూర్తి' కార్యక్రమం

- 74 రెసిడెన్షియల్ విద్యాసంస్థల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు కలెక్టర్ డా.సత్య శారద





**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 5**
ప్రభుత్వ గురుకుల పాఠశాలలు,సంక్షేమ వసతి గృహాల నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల్లో చైతన్యం,క్రమశిక్షణ,నాణ్యమైన విద్యను ప్రోత్సహించేందుకు జిల్లా వ్యాప్తంగా'స్ఫూర్తి'కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 74 ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు,కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీలు),మోడల్ స్కూళ్లకు జిల్లా,మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు వెల్లడించారు.ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన విద్యాసంస్థలను నిరంతరం సందర్శించి విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యత,తాగునీటి సౌకర్యం,పారిశుద్ధ్యం,వసతి,భద్రత,విద్యా ప్రమాణాలు,మౌలిక సదుపాయాలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.తనిఖీల అనంతరం లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ నివేదికలను జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే'స్ఫూర్తి'కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.